శేరిలింగంపల్లి ఆర్ఐ బదిలీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు బదిలీ అయ్యారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న చంద్రారెడ్డికి శేరిలింగంపల్లి ఆర్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. బుధవారం చంద్రారెడ్డి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు.

'నిథమ్' ఆధ్వర్యంలో నేటి నుంచి వర్క్‌షాప్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు బేగంపేట్‌లో రెండో రోజు నిథమ్‌లో ఈ వర్క్‌షాప్ కొనసాగనుంది. ఈనెల 17, 19 తేదీల్లో రెండు రోజుల పాటు 'స్టేక్‌హోల్డర్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఇన్ కోర్స్ కరికులమ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. యూరోపియన్ యూనియన్ సహకారంతో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు 17న టూరిజమ్ ఇండస్ట్రీ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమాన్ని బేగంపేట్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహిస్తారు. 19న నిథమ్ క్యాంపస్‌లో వర్క్‌షాప్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ప్యానల్ డిస్కషన్స్ నిర్వహిస్తారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయ్ కుమార్ తదితరులు

శేరిలింగంపల్లి: చందానగర్ పీజేఆర్ స్టేడియం వద్ద హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటుతో క్రీడాకారులతో పాటు వాకర్స్, పరిసర ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. 10 ఏళ్లగా హోప్ ఫౌండేషన్ చలివేంద్రం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తోపుగొండ మహిపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్ రాజశేఖర్, శాంతి భూషన్‌రెడ్డి, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, మారం ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: మాదాపూర్‌లోని ఖానామెట్ తమ్మిడి కుంట చెరువు పరిసరాల్లో అక్రమంగా వెలసిన షెడ్‌లను, డంపింగ్ యార్డ్‌లను బుధవారం జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది తొలగించారు. . గతంలోనూ ఈ ప్రాంతంలో షెడ్‌లను తొలగించినా తిరిగి నిర్మించడమేగాక వ్యాపార సముదాయాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధి చుట్టూ అక్రమంగా వెలసిన కట్టడాలను తొలగించారు. గుడిసెల్లో నివాసమున్న వారికి వారం రోజులు గడువు ఇచ్చారు. అప్పటి లోగా తీసివేయాలని లేని పక్షంలో కూల్చివేస్తామని హెచ్చరించారు.

ఫుట్‌పాత్ ఏర్పాటు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

గచ్చిబౌలి: పాదచారులకు ఫుట్‌పాత్‌లను సిద్ధం చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ జగదీష్ పర్యవేక్షణలో సిబ్బంది శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రధాన రోడ్లను పరిశీలించారు. ఇందిరానగర్, గచ్చిబౌలి రోడ్లను పరిశీలించిన వారు ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు, చెత్తాచెదారం, నిర్మాణ సామాగ్రి వంటి వాటిని తొలగించి పాదచారులకు వీలుగా చర్యలు చేపట్టారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

గచ్చిబౌలి: గంజాయి తరలిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన కవిరి రంజిత్(21) నగరంలో జెప్టో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. శామీర్‌పేట్ మండలంలోని కేశవరంలోని ఓ వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని వచ్చిన అతను మంగళవారం సాయంత్రం గచ్చిబౌలి ఇందిరానగర్‌లో బస్‌స్టాప్‌లో ఉండగా ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'యువ వికాసం'@ 2,023

యువతకు మెరుగైన ఉపాధికి 'రాజీవ్' పథకం

రూ. 4 లక్షల రుణాలకు అధికంగా దరఖాస్తులు

త్వరలో లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు


రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: నిరుపేద నిరుద్యోగులకు ఆర్థిక సాయం అందించి ఉపాధి పొందేలా తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రారంభంలో ఆన్‌లైన్‌లో మాత్రమే మీ-సేవా కేంద్రాల్లో ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మీ-సేవా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించడంతో పునరాలోచన చేసిన ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు పొడిగించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్ వార్డు కార్యాలయాల్లో ఈ మేరకు ప్రత్యేక కేంద్రాలు తెరిచి సిబ్బందిని నియమించి దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో 2,023 మంది దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది దుకాణాల ఏర్పాటుకు మొగ్గుచూపారు. రూ. 4 లక్షల రుణాలకు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

కమిటీ పరిశీలన..

రాజీవ్ యువ వికాసానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను త్వరలో ఎంపిక చేయనున్నారు. వార్డు స్థాయిలో ఇందుకు సంబంధించి కమిటీ ఏర్పాటుచేసే దిశలో ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత బ్యాంక్ మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీల ఆర్థిక సంస్థల ప్రతినిధులు కమిటీలో ఉండనున్నారు. ఈ కమిటీ అభ్యర్థుల ధ్రువపత్రాల ప్రామాణికతను, వారి అర్హతను ధ్రువీకరించి ఎంచుకున్న స్వయం ఉపాధి పథకం సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. కమిటీ తయారుచేసిన తుది జాబితాను జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు.

- జిల్లా స్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ఉంటారు. ఈ కమిటీ స్వయం ఉపాధి పథకం ఎంపిక చేసిన అనంతరం ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేయనున్నారు.
- లబ్ధిదారులకు 15 రోజుల వరకు శిక్షణ ఇవ్వనున్నారని అధికారులు వెల్లడించారు.

డివిజన్ వారీగా వచ్చిన దరఖాస్తులివీ..

డివిజన్	దరఖాస్తులు
సోమాజిగూడ	242
ఖైరతాబాద్	523
వెంకటేశ్వరకాలనీ	334
బంజారాహిల్స్	189
జూబ్లీహిల్స్	735

లింగంపల్లిలో 'గావ్ చలో... బస్తీ చలో' కార్యక్రమం


మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దశాబ్ద కాలంగా వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణం అమోఘమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర పథకాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన గావ్ ఛలో... బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం లింగంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పథకాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు, రూ.12 లక్షల ఆదాయం ఉన్న వారికి జీరో ట్యాక్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలు, దేవాలయాల శుభ్రత, బస్తీ దవాఖానాలు, పాఠశాలలు,అంగన్ వాడీ సెంటర్లు, స్మశాన వాటికల్లో ఉన్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించడమే ఈ కార్యక్రమ ఉద్దేశంగా పేర్కొన్నారు. నాయకులు ఎల్లేష్, కిషోర్ ముదిరాజ్, మణి భూషణ్, శాంతి భూషణ్, నర్సింగ్ యాదవ్, నర్సింగ్‌రావు, వెంకటస్వామి రెడ్డి, రమరాజు, కేశవరావు, నరేందర్‌రెడ్డి, నరసింహాచారీ, కుమార్‌యాదవ్, కమలాకర్‌రెడ్డి, రమేష్, రామ్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



గచ్చిబౌలి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. బుధవారం కొండాపూర్‌లోని మాదాపూర్ స్టీల్ హౌస్ డీలర్‌షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారులకు సరైన ఎంపిక భారతి సిమెంట్ అని ఆయన గుర్తు చేశారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంట్ నాణ్యతలోనే కాకుండా సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 40 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి


క్రికెట్ అకాడమీని ప్రారంభించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీని బుధవారం రాయదుర్గంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా అకాడమీని ప్రారంభించిన అనంతరం క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో ఆసక్తి పెంపొందించాలన్నారు. చదువుతోపాటు క్రీడలలో పాల్గొంటే చిన్నతనంనుంచి పిల్లల్లో క్రీడా స్ఫూర్తి నెలకొంటుందన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి తగిన శిక్షణ ఇస్తే భవిష్యత్తులో రాణించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ తౌఫిక్, అర్జున్‌తోపాటు స్థానికులు దారుగుపల్లి నరేష్, పాండు, సలావుద్దిన్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని లక్డారం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామం పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలకు రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. కార్యక్రమాల్లో రుద్రారం పీఏసీఎస్ అధ్యక్షుడు పాండు, ముత్తంగి పీఏసీఎస్ అధ్యక్షుడు భిక్షపతి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మేరాజ్ ఖాన్, అశోక్, కిట్టు, రామకృష్ణ, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

జిన్నారం (పటాన్‌చెరు): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం జిన్నారం, ఊట్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సరైన మద్దతు ధర పొందాలని సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, ఐకేపీ ఏపీఎం నరేందర్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వడ్డే కృష్ణ, ఐకేపీ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి

పశువైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్

పటాన్‌చెరు టౌన్: రైతులు పాడి పశువులను ఆరోగ్యంగా కాపాడుకుంటే ఆర్థికాభివృద్ధి చెందవచ్చని మండల పశు వైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలో 220 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పశువులకు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సర్దార్, శ్రావణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు


రింగ్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద బుధవారం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రింగ్‌రోడ్డు నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లేందుకు టోల్‌గేట్ వద్ద వాహనదారులు సర్వీస్ రోడ్డుపై వరకు క్యూ కట్టారు. దీంతో వెలిమెల వైపు నుంచి ర్యాంప్ రోడ్డు మీదగా కొల్లూర్ వైపు వచ్చే వాహనాదారులు సైతం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడ్డారు. అక్కడ ట్రాఫిక్ నియంత్రించేందుకు టోల్ సిబ్బంది కూడా లేకపోవడం విశేషం. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటితో ముగియనున్న ప్రజాభీష్టం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఆందోళనలు 71వ రోజుకు చేరుకున్నాయి. డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై అధికారులు వారం రోజులుగా కొనసాగిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రి య గురువారంతో ముగియనుంది. ఈ మేరకు తహసీల్దార్ పరమేశం బుధవారం మీడియాకు వెల్లడించారు. కార్యక్రమం ముగిసేలోపు ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలు అందించవచ్చన్నారు. సేకరించిన అభిప్రాయాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందించనున్నట్లు తెలిపారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ కాలనీలో డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర, లైన్‌మెన్ సుధాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ.1500 చొప్పున, ఇద్దరికి రూ.2 వేలు చొప్పన, ఒకరికి రూ.వెయ్యి చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఉర్దూ మీడియంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మధ్యమంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు 'మనూ' మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ బుధవారం తెలిపారు. యూనివర్శిటీలో 2004లో పోస్టుగాడ్యుయేట్ స్థాయిలో ఎంబీఏ కోర్సును ప్రారంభించినట్లు ఆయన గుర్తు చేశారు. ఎంబీఏ బోధనా మాధ్యమం ఉర్దూ అయినా కోర్సు సమయంలో విద్యార్థులకు ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసంతో పాటు ఏఐసీటీఈ సిఫార్సు చేసిన సిలబస్‌ను బోధిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు సులభంగా ఉద్యోగాలు పొందుతున్నారని గుర్తు చేశారు. ఏదైనా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌లో ఉర్దూను సబ్జెక్టు/భాషగా లేదా మీడియంగా మనూ ఆమోదించిన 10వ/12వ/గ్రాడ్యుయేషన్ స్థాయి లేదా తత్సమానమైన మదర్సాకోర్సులలో ఉర్దూ బోధనా మాధ్యమంగా ఉన్న అభ్యర్థులు ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు చివరి తేదీ మే 13గా పేర్కొన్నారు. వాణిజ్య, నిర్వహణ విభాగం కూడా మెరిట్ ఆధారంగా ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలను అందిస్తోందన్నారు. వీటికి దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ జూన్ 4వ తేదీ అని తెలిపారు. ఈ విభాగం బీకామ్(ఆనర్స్/పరిశోధన) కోర్సును కూడా నిర్వహిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9849325765, 9700911532లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సాంకేతిక విద్యా కేంద్రంగా హైదరాబాద్


మాట్లాడుతున్న డాక్టర్ మానిక్ కుమార్

మాదాపూర్: సాంకేతిక ప్రతిభ, విద్యానైపుణ్యానికి హైదరాబాద్ శక్తివంతమైన కేంద్రంగా ఉందని డాక్టర్ మానిక్‌కుమార్ అన్నారు. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో బుధవారం రేపటి ఉద్యోగాల కోసం ఇంజనీరింగ్ విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మెషీన్‌లెర్నింగ్, రోబోటిక్స్, గ్రీన్ టెక్‌వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఉద్యోగ మార్కెట్‌ను ఎలా పునర్నిర్మిస్తున్నాయో తెలిపారు. విద్యావ్యవస్థలు తదనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరం వ్యూహాత్మక ప్రముఖ్యతను కలిగివుందన్నారు. శక్తివంతమైన టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌గా మాత్రమే కాకుండా ప్రముఖ సంస్థలు, వ్యవస్థాపక వెంచర్లకు దోహదపడే విధంగా ఉందన్నారు. బిఎంయు ప్రవేశ ప్రక్రియ, మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు, అనుభవపూర్వక అభ్యాసం , పరిశ్రమ సహకారాల ద్వారా కెరీర్ ఫలితాలపై విశ్వవిద్యాలయం అందిస్తున్న మరిన్ని విషయాలను తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం



షూటింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2025లో భాగంగా బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని శాట్స్ షూటింగ్ రేంజ్ ప్రాంగణంలో షూటింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో అన్ని రకాల క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని, విద్యార్థుల ఆసక్తిని బట్టి శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల క్రీడలలో ప్రత్యేక శిక్షణలు ఇప్పించి క్లస్టర్, రీజనల్, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎదిగేలా చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడల ఉపాధ్యాయురాలు సంజుకుమారి పర్యవేక్షణలో 13 మంది 9వ తరగతి హైదరాబాద్ రీజియన్ కేంద్రీయ విద్యాలయాల నుంచి ఈ షూటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అందులో 9 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు,క్రీడాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గేమ్ ఆన్ ప్లే జోన్ ప్రారంభం


గేమ్ ఆన్ ప్లే జోన్‌ను ప్రారంభిస్తున్న సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తదితరులు

శేరిలింగంపల్లి: చందానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గేమ్ ఆన్ ప్లే జోన్‌ను సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి, వీకెండ్స్‌లో చిన్నారులకు వినోదాన్ని అందించేందుకు ప్లేజోన్ ఉపయోగపడుతుందన్నారు. అన్ని వర్గాలకు గేమ్ ఆన్ ప్లే జోన్ అందుబాటులో ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. . నిర్వాహకులు అభిలాష్, శ్రావ్యలు మాట్లాడుతూ చిన్న, పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ గేమ్స్ ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు.వర్చువల్ గేమ్స్, బౌలింగ్, సాఫ్ట్ ప్లే, క్రికెట్, హ్యూమస్ క్లా, కార్నివాల్ గేమ్స్, డాషింగ్ కార్స్ గేమ్స్ వంటివి అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లాలమ్మ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ నేతల పర్యటన


ప్రజలతో మాట్లాడుతున్న సీతారాం

మణికొండ: ప్రజలకు సౌకర్యాలను కల్పించేలా చేయాల్సిన అభివృద్ధి పనులు కాంట్రాక్టర్లకు మేలు జరిగేలా నాసిరకంగా కొనసాగించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. బుధవారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా లాలమ్మ గార్డెన్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ వార్డులో, కాలనీలో సమస్యలే లేవని చెపుతున్న మాజీ ప్రజాప్రతినిధులు ఒక సారి కాలనీల్లో పర్యటించాలన్నారు. లాలమ్మ గార్డన్ రోడ్డు నెంబర్ 4లో వేసిన డ్రైనేజీ పనులు నాసిరకంగా జరగటంతో కొద్ది పాటి వర్షం కురిస్తే నీరంతా రోడ్లపై నిలుస్తుందన్నారు. ఆస్తి పన్నులను ఇష్టారాజ్యంగా వేయటంతో ప్రజలు చెల్లించేందుకు విముఖత చూపడటంతో పాటు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆయన అన్నారు. మంచినీటి సరఫరా నిర్ణీత సమయం లేకుండా ఎపుడు పడితే అపుడు వారి ఇష్టం వచ్చినంత సమయమే వదలటంతో అది సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీల్లో వీధి కుక్కల సమస్య విపరీతంగా ఉందని, రోడ్ల పక్కన వేస్తున్న చెత్తను ఏ రోజుకు ఆ రోజు తొలగించకపోవటంతో దుర్గంధం, దోమల వ్యాప్తికి కారణం అవుతుందన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి లాలమ్మ గార్డెన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎక్కి.. దిగాల్సిందే..

పాదచారుల వంతెనల వద్ద పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్

మియాపూర్: పాదచారుల వంతెనలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. చందానగర్ , గంగారం వద్ద పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు సమీపంలోని వంతెన, దీప్తిశ్రీనగర్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న వంతెనల వద్ద ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయడం లేదు. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు, వంతెన మెట్లు ఎక్కి దిగలేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఏడాదిగా వంతెన ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయడం లేదు. సంబంధిత అధికారులకు పరిసర కాలనీవాసులు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు


పనిచేయని ఎస్కలేటర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462